


పోలీసు స్టేషన్‌ను పరిశీలించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక పోలీసు స్టేషన్‌ను పార్వతీపురం ఎఎస్‌పి అంకిత సురానా మహవీర్ సోమవారం పరిశీలించారు. మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలసలో గత నెల 27న క్రికెట్ ఆటలో బిసి, ఎస్‌సిలకు చెందిన రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవ కులదూషణకు చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తునకు ఆమె విచ్చేశారు. విచారణ అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో రికార్డులు తనిఖీ చేశారు. అలాగే కొత్తవలస ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె వెంట సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ హెచ్ సి కృపారావు ఉన్నారు.

వైద్యసేవలు మెరుగుపర్చాలని

4న డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా

పలు ప్రభుత్వ వైద్యశాలలను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలో అన్ని పట్టణ, మండల, గ్రామాల్లో జ్వరాలతో మరణాలు సంభవించాయని, ప్రభుత్వం మందులు సరఫరా చేసి, రెగ్యులర్ డాక్టర్లు సిబ్బందిని నియమించి వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని, వార్డులు వారీ, గ్రామ గ్రామాన వైద్య శిబిరాలు నిర్వహించాలని, జ్వరాలతో మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని, హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని కోరుతూ ఈనెల 4న స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద, 4,5,6 తేదీల్లో కురుపాం, సాలురు, పాలకొండ సిహెచ్‌సిల వద్ద సిపిఎం తలపెట్టిన ధర్నాలు జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జ్వరాల తీవ్రత, వైద్య సౌకర్యాలపై పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలను రెడ్డి వేణుతో పాటు గొర్లె వెంకటరమణ, బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్, కృష్ణ తదితరులు పరిశీలించారు. పార్వతీపురం పట్టణంలోని 15 వార్డులు, 23,000 మంది జనాభాకు జగన్నాధపురం పట్టణ ప్రాథమిక వైద్య ఉందని, దీనికి 50,60 మంది రోగులు వస్తున్నారన్నారు. డిసెంబర్ నుండి రెగ్యులర్ డాక్టర్ లేరని, ఇన్చార్జి వారంలో రెండు, మూడు సార్లు వస్తాస్తున్నారన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ,వైరల్ ఫీవర్లు ఎక్కువగా గుర్తించామన్నారు. కావున ప్రతి వార్డులో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, దోమలు నివారించాలని కోరారు. అలాగే బెలగాంలో గల పట్టణ ప్రాథమిక వైద్యశాలల్లో 21 వేల మంది జనాభాకు రెగ్యులర్ డాక్టర్లు లేరని, ఇక్కడ కూడా ఇన్‌ఛార్జి వైద్యాధికారే ఉన్నారన్నారు. పట్టణ విస్తరణం పెరుగుతున్నందున కొత్తవలస, చాకలి బెలగాం మరొక రెండో పట్టణ పిహెచ్‌సి ఏర్పాటు చేయాలన్నారు. పార్వతీపురం రూరల్‌లో బందలుప్పి, పెద్ద బొండపల్లి, డోకిశీల మూడు పీహెచ్సీలు ఉన్నా ప్రజలకు వైద్య సౌకర్యం సరిగ్గా అందడం లేదని పేషెంట్లు అంటున్నారు. మండలం విస్తరణ, పీహెచ్సీలు దూర ప్రాంతం కావడం వల్ల వైద్యం అందడం లేదని, కావున మండలంలో మరో పిహెచ్‌సిని ఏర్పాటు చేసి పునర్విభజన చేపట్టాలన్నారు. ఇటీవల మలేరియా టైఫాయిడ్ డెంగీతో మృతులు కురుపాం, జి.ఎల్.పురం, జియ్యమ్మవలస వారు పార్వతీపురం, తదితర చోట్ల ప్రవేట్ హాస్పటిల్‌లో వైద్యం చేయించారని, వైద్యం జాప్యం వల్లే జ్వరాలు ఎక్కువ అయ్యాయని, మెరుగైన వైద్యం కోసం విజయనగరం, శ్రీకాకుళం తీసుకు వెళ్ళినా ఫలితం లేకపోయిందని బాధిత కుటుంబాలు బాధపడుతున్నాయి. కావున పిహెచ్‌సిల్లో జరుగుతున్న వైద్యంపై, జ్వరాలు, మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందక పోవడం వల్ల ఏజెన్సీలో ప్రజలు ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అన్ని పట్టణ వార్డుల్లో, గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. గిరిజనులకు వైద్య సేవలు అందాలంటే జిల్లాలో అనేక చోట్ల ప్రజలకు దగ్గరగా పీహెచ్సీలు, హెల్త్ సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, బలిజిపేట, సీతానగరం, కొమరాడ గరువుబిల్లి మండలాల్లోని పిహెచ్‌సిల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చి రోగులకు మందులు అందుబాటులో ఉంచాలని నాయకులు కోరారు.

అలాగే ప్రభుత్వ హాస్పటిల్‌లో మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని, పార్వతీపురంలో మెడికల్ కాలేజీ నిర్మించాలని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం, సిహెచ్‌సి, పిహెచ్‌సి భవన నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని కోరారు. కురుపాం, సీతంపేట, సాలూరు హాస్పటళ్లను సూపర్ స్పెషాలిటీగా మార్చాలని, గుమ్మలక్ష్మీపురం సిహెచ్‌సిని ఏరియా హాస్పటిల్ వంద పడకల హాస్పటిల్ చేయాలని డిమాండ్ చేశారు, కురుపాం, పాలకొండ , సాలూరులో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలని, బ్లడ్ బ్యాంక్‌ను, ప్లేట్ లెట్స్ కురుపాంలోనే అందుబాటులోకి తీసుకురావాలని నాయకులు కోరారు.



బెలగాంలో యుపిహెచ్‌సిని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ఏకలవ్య విద్యార్థికి పాముకాటు?

- అనుమానంతో ఆసుపత్రికి తీసుకొచ్చిన సిబ్బంది
- మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలింపు
- విద్యార్థిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆశ్రమ పాఠశాలల్లో ఉంటున్న గిరిజన విద్యార్థులు అనారోగ్య బారిన పడడం, పాము కాటుకు గురి కావటం వంటి సంఘటనలతో ఇబ్బందులు పడుతున్నారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతం కావడం, అడవుల సమీపాన పాఠశాలల ఉండడంతో విష సర్పాల బెడద వెంటాడుతుంది. ఇందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతి ఆరిక వరుణ్ (11) కాలిపై పాము కాటు వేసినట్లు గుర్తులు ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే ఉపాధ్యాయులకు తెలిపాడు. అనుమానంతో అప్రమత్తమైన సిబ్బంది వైద్యం కోసం భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థికి పాము కాటు వేయలేదని ముళ్ళ గుచ్చి ఉంటుందని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. ఇదే విషయమై వైద్యులను వివరణ కోరగా విష కీటకం కాటు గుర్తులు కనిపించాయని, పాముకాట కాదా లేదా మరి ఏదైనా విషకీటకమా అనుమానంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. విద్యార్థికి పాము కాటు వేసిందని తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని ఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో 10 ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ బిఎండి ప్రసాదరావు, డిసిఆర్‌బి ఎస్‌ఐ పాపారావు సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

నార్లవలసను రెండు పంచాయతీలుగా విడదీయాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

నార్లవలసను రెండు పంచాయతీలుగా విడదీసి నూతన పెద్దవలస కేంద్రంగా నూతన పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు మాట్లాడుతూ నార్లవలస పంచాయతీ ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉందని సాలూరు మొదలుకొని మక్కువ వెళ్లే వరకు పంచాయతీకి సంబంధించిన గ్రామాలు ఉన్నాయని చెప్పారు. పంచాయతీ కార్యాలయానికి గ్రామాల నుండి వెళ్లాలంటే సుమారు 10 కిలోమీటర్లు దూరం ఉందని కనీసం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఇబ్బందులను చెప్పుకోవాలన్న కాలిబటను వెళ్ళవలసి వస్తుందని, ఆటోలు ఏర్పాటు చేసుకొని వెళ్ళాలంటే చాలా ఖర్చులు అవుతున్నాయని చెప్పారు. పెద్దవలస, భరణికి వలస, బొడ్డపాడు, మూలవలస, డబ్బసదును, బొర్రపనుకు వలస, జిల్లెడవలస, సీతాన్నదొర వలస గ్రామాలను కలుపుకొని పెద్దవలస కేంద్రంగా నూతన పంచాయతీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులకు గత ఐదు సంవత్సరాలుగా తెలియజేస్తున్నా కనీసం పట్టించుకోవటం లేదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో వున్న నాయకులు అధికారులు పెద్ద వలస పంచాయతీని నూతనంగా ఏర్పాటు చేసి మారుమూల గ్రామాల్లోని ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు కూనెటీ చినబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు గెమ్మేల వంశి, కోమన్న, చంటి, నాగరాజు, బర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి విపత్తు యాజమాన్య ప్రణాళిక ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రతి మండలంలో మండల స్థాయి విపత్తు యాజమాన్య ప్రణాళిక (డిజాస్టర్ మాస్టర్ ప్లాన్) ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. వర్షాలు, పిజిఆర్ఎస్, సంపూర్ణ పోషణ, గృహ నిర్మాణం తదితర అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్, ఎంపిడిఒ, జలవనరులు శాఖ అధికారి, ఆర్ అండ్‌బి, గృహ నిర్మాణం తదితర శాఖల అధికారులతో విపత్తు యాజమాన్య బృందం తక్షణం స్పందించాలన్నారు. మండలాల్లో ప్రమాదకర పరిస్థితులపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ, పాఠశాల, వైద్యశాల భవనాలు, ఇళ్లు గుర్తించాలని, అధిక వర్షాల సమయంలో వాటిలో ఎవరు ఉండరాదని ఆదేశించారు. ప్రతి అంశంపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలని, సమాచారం పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. రానున్న మూడు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని, పరిస్థితులకు అనుగుణంగా సంసిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. చెత్త నుండి సంపద తయారి కేంద్రాలు (ఎస్.డబ్ల్యూ.పి.సి) అన్ని పనిచేయాలని, వర్మీ కంపోస్టు ఉత్పాదన చేయాలని ఆయన ఆదేశించారు. అక్టోబర్ 2నుంచి జిల్లాలో గల 138 కేంద్రాలు పని చేయుటకు ఎంపిడిఒలు చర్యలు చేపట్టాలన్నారు. వీటిని ప్రతి శుక్రవారం పర్యవేక్షిస్తామని అన్నారు. గృహ నిర్మాణం ప్రగతి వేగం కావాలని ఆయన ఆదేశించారు. 5 వేల జనాభాకు మించిన పంచాయతీ పూర్తిగా సౌర విద్యుత్తు వినియోగం కిందకు మారితే ఆ పంచాయతీకి మౌలిక సదుపాయాలు కల్పన నిమిత్తం కోటి రూపాయలు వరకు గ్రాంటును కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. పోషణ అభియాన్ కింద ఈనెల 2నుంచి నిర్వహిస్తున్న పౌష్టికాహార వారోత్సవాలను షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని జిల్లా ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణిని జిల్లా కలెక్టరు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, విద్యా శాఖ ఎడి ఎం.ఇ రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పారాది కాజ్‌వేను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వేను సోమవారం ఎమ్మెల్యే బేబినాయన పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేగావతి నది ఉధృతంగా ప్రవహించడంతో కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాలను తెర్లాం, బాడంగి మండలాల మీదుగా దారి మళ్లించారు. కాజ్‌వేను పరిశీలించిన బేబినాయన నీటి ఉధృతి తగ్గిన వెంటనే కాజ్‌వేను బాగు చేసి, వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తామని చెప్పారు.

పాడి సంపద పెరగాలి : జెడి

ప్రజాశక్తి - భామిని


మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులు సంఖ్య పెరిగి, పాడి సంపద పెరగాలని జిల్లా పశుసంవర్ధక అధికారి శివ్వాల మన్మధరావు తెలిపారు. భామిని పశు వైద్య కేంద్రంలో వైద్యాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పశువులకు శత శాతం వాక్సినేషన్, ప్రతి పశువులు పశు భీమా పరిధిలోకి రావాలన్నారు. ప్రస్తుతం భామిని పశు వైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకున్నందున రైతు సేవా కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. కొత్త పశు వైద్య భవనానికి ప్రతిపాదనలపై అధికారులు పంపిస్తామని తెలిపారు. మండలానికి 25 గోకులాలు మంజూరయ్యాయని, పాడి పశువులకు నిర్మించే గోకులాలకు ప్రభుత్వం 90శాతం రాయితీ ఇస్తుందన్నారు. గొర్రెలు, మేకల కోసం నిర్మించిన గోకులాలకు 70శాతం రాయతీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా భామినిలో విధులు నిర్వహిస్తున్న పశు వైద్యులు వారంలో ప్రతి సోమ, బుధ, గురువారం పాడి రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. మండలం లో పశు వైద్య సేవలు సంతృప్తి కరంగా ఉన్నాయని జె డి తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అదనపు సంచాలకులు బసవ శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళా అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతుందని టిడిపి రాష్ట్ర నాయకులు మర్రాపు పురుషోత్తమనాయుడు అన్నారు. మండలంలోని పెద్దూరు, నాగూరు, సంతోషపురం, లఖనాపురం, వల్లరిగుడబకు చెందిన మహిళలకు ఉన్నతి (మహిళాశక్తి) పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఆటోలను సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అర్హులైన ఎస్సీ,ఎస్టీ మహిళలకు కేవలం 10 శాతం వ్యయంతో వారు ఆటోలు సమకూర్చుకుని వాటి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఈపథకం ద్వారా 90 శాతం రుణ సౌకర్యంతో ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం సెర్ప్ పరిధిలోని "ఉన్నతి" కార్య క్రమంలో వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఎ.మధుసూదనరావు, నాయకులు అంబటి తవిటినాయుడు (రాంబాబు), కోట భరత్ కుమార్ (సుమన్) ముదిలిబాబు విజయవాంకుసం ఎపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, సర్పంచ్ రౌతు గోవిందనాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్ : రాజన్నదొర



వైఎస్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

తెలుగు రాష్ట్రాలలోని పేదల గుండె చప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. సోమవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బోసు బొమ్మ జంక్షన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినూత్న సంక్షేమ పథకాల అమలు ద్వారా మాజీ సిఎం వైఎస్సార్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్ మోహన్ రావు, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలిలో స్థానిక జెడ్‌పిటిసి శశికళ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కిషోర్, వైస్ ఎంపిపి సంపత్, పల్ల అనంతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పేదల హృదయాల్లో చిరస్మరణీయులు కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వైఎస్ 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఆర్‌టిసి కూడలి వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి జోగారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు మూడు మండలాలు, పురపాలక సంఘం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నివాళ్లు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, మూడు మండలాల జెడ్‌పిటిసిలు సభ్యులు, ఎంపిపిలు, వైస్ ఎంపిఇలు, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, నియోజకవర్గ స్థాయి వైసిపి సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, జెసిఎస్ కన్వీనర్లు, మూడు మండలాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : వైయస్సార్ వర్ధంతి సందర్భంగా కురుపాంలో గల రావాడ కూడలి వద్ద ఉన్నటువంటి వైయస్సార్ విగ్రహానికి ఎంపిపి శెట్టి పద్మావతి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి జి.సుజాత, జిల్లాకు ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్,మండల కన్వీనర్ ఐ .గౌరీ శంకర్, వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు వి.బంగారు నాయుడు,టివిఎస్ స్వామి యోధులు,వైసిపి నాయకులు గవర విజయ, షేక్ నూరేళ్ల తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెద్ద అంకలాంలో ఎంపిపి బి.రవణమ్మ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలదండుల వేసి నివాళ్లు అర్పించారు. సుమిత్రాపురం గ్రామ సర్పంచ్ బొత్స నందిని ఉమామహేశ్వరరావు, లచ్చపేటలో సర్పంచ్ కృష్ణ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిటిసి ఎ.సింహాచలం, సీతానగరంలో వైసిపి నాయకులు ఆర్ వి కిషోర్, బి.సూర్యనారాయణ, సురేష్, రమేషుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలకు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

వీరఘట్టం : మండలంలోని తెట్టంగిలో ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు ఎస్.చిన్నంనాయుడు, పి.పరిశినాయుడు, అలజంగి ఎలియా, గ్రామ కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మ లక్ష్మీపురంలో వైసిపి నాయకులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి కె. దీనమయ్య, జడ్పిటిసి రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక లక్ష్మణరావు, వైసీపీ మండల ఉపాధ్యక్షులు బి.గౌరీశంకర రావు, నాయకులు గిరిబాబు, నిమ్మక గోపాల్, తోయక గోపాల్, పాలక ప్రేమానంద్, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని కొరమ కూడలి వద్ద గల వైఎస్ విగ్రహానికి వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎం పి పి బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్ తోఫురానా శ్రీను, వై సి పి నాయకులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి మూడు రోడ్ల కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి జిల్లా వైసిపి కార్యదర్శి దండి శ్రీనివాసరావు మాల వేసి నివాళుల అర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సువ్వాడ శశికళ, రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, మువ్వల ఆదయ్య, గొర్ల రాజారావు, పరిమళ, పలువురు ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలో శివరాంపురం, తోణాం, కురుకుట్టి, కందులపదం తదితర గ్రామాల్లో వైఎస్‌కు ఘనంగా నివాళు లర్పించారు. బాగవలసలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో నివాళ్లు అలర్పించారు.



పార్వతీపురంలో వైఎస్‌కు నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, కార్యకర్తలు

పాలకొండ: కార్గిల్ పాయింట్ దగ్గర వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్సీ పాలవలన విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాల భాను, చైర్ పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ ఎంపిపిలు కనపాక సూర్య ప్రకాష్, వాకమూడి అనిల్, వైసీపీ పట్టణ అధ్యక్షులు వెలమల మన్మధ రావు, కడగల రమణ, దుప్పాడ పాపి నాయుడు, లిల్లీ పుష్పనాథం, నీలాపు శ్రీను, కొంచాడ అరుణ్, తదితరులు ఉన్నారు.



పాలకొండలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే



ప్రతిజ్ఞ చేస్తున్న ఎఇ జగన్మోహనరావు

ఘనంగా విద్యుత్తు భద్రతా దినోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

విద్యుత్ భద్రత దినోత్సవం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎఇ ఎ.జగన్మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 2న విద్యుత్ భద్రత దినోత్సవ సందర్భంగా విద్యుత్ పరికరాలపై విద్యుత్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసర ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దగ్గరుండి మరమ్మతులు చేయిస్తున్న ఎస్ఐ

పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక సువర్ణముఖి నది వంతెనపై గోతులు ఏర్పడడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారించే చర్యల్లో భాగంగా ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతు పనులు చేపట్టారు. అలాగే కాశీపేట వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతులను పూడ్చారు. దీంతో కొంతవరకు ప్రమాదాల నివారణ జరుగుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



పార్వతీపురంరూరల్: సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జోగారావు

సర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని గోపాలపురం సర్పంచ్ పెంట స్రవంతి మామ వెంకటనాయుడు ఇటీవల మృతి చెందడంతో సర్పంచి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరామర్శించారు. ఆయనతో ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి బంకురు రవికుమార్, పలువురు పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలిపారు.

సీతానగరం: మండలంలోని నిడగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్ రామకృష్ణను మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అభినందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ గా పాఠశాల అభివృద్ధికి కట్టుబడి పని చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, గ్రామం వైసిపి సీనియర్ నాయకులు గాజాపు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా కోడూరు సాయి

ప్రజాశక్తి - సాలూరు



ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపస్మా) నియోజకవర్గ స్థాయి నూతన కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షునిగా డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మజ్జి వైదేహి, కోశాధికారిగా పి.ధనంజయరావు, కార్యనిర్వాహణక సభ్యులుగా రెడ్డి రాజశేఖర్, అక్కేన ప్రసాద్ ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా కోడూరు సాయి శ్రీనివాసరావు ఎన్నికవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురంలో జనహిత కళాశాల ఎదురుగా రూరల్ పోలీసులు జరుగుతున్న తనిఖీల్లో సోమవారం పార్వతీపురం నుండి బొబ్బిలి వైపు తరలిస్తున్న 19 పశువులు గల వాహనాన్ని హెడ్‌కానిస్టేబుల్ జయరావు పట్టుకున్నారు. పశువుల రవాణానికి సంబంధించి, దానికి సంబంధించి అనుమతులు అడుగ్గా, రవాణాకు సంబంధించి ఏ విధమైన అనుమతులు లేకపోవడంతో పశువులను స్వాధీనం చేసుకొని సమీప గ్రామంలోని రైతులకు సంరక్షణ నిమిత్తం అప్పగించి వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.



జన్‌మన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రామ నాయకులు

మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ గ్రామస్తులకు సూచించారు. సోమవారం మండలంలోని ఇచ్చాపురంలో నిర్వహించిన జన్‌మన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఏ విధమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలో తమ దృష్టికి తీసుకువస్తే వాటిని నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామని చెప్పారు. గ్రామాల్లో రహదారులు మంచినీటి సౌకర్యం, విద్యుత్తు, గృహ నిర్మాణాలు, తదితర రకాలైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరినాయుడు, పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణదుర్గ, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇఒపిఆర్‌డి ఎం.నాగభూషణరావు, పంచాయతీ కార్యదర్శి వసంత పాల్గొన్నారు.

మెనూ పక్కాగా పాటించాలి

ప్రజాశక్తి- సీతంపేట



పాఠశాలను పరిశీలిస్తున్న ఎపిఒ చిన్నబాబు

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు అన్నారు. సోమవారం ఆయన దోనుబాయి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన స్టోర్ రూమ్‌లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వంట సరుకులను పరిశీలించి విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం.నారాయణరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా .. పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - కురుపాం

జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం కురుపాంలో జనసేన నాయకులు నేరేడుబిల్లి వంశీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే టి. జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేష్ కట్ చేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొమరాడ : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యాన మండలంలోని అర్తాంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.లక్ష్మునాయుడు, పి.గంగప్పాప్ప, బి.వెంకటి, పోలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక గ్రామ సచివాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ దేవ్ పేదలకు చీరలు, నిత్యావసర వస్తువులు, పళ్ళు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్ రావు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, మండల టిడిపి, జనసేన నాయకులు, అభిమానులు, సచివాలయం ఉద్యోగులు

పాచిపెంట : మండలంలోని పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జనసేన మండల అధ్యక్షుడు గొర్లె జగదీష్ ఆధ్వర్యాన పలు గ్రామాల్లో



సీతంపేట : రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

బైక్ ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. అనంతరం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం చేశారు. అనంతరం సుమారు 22 మందికి రక్తదానం చేశారు. అలాగే సాలూరు పిహెచ్‌సిలో వంద మందికి ఆహారం పంపిణీ చేశారు. పాచిపెంట పిహెచ్‌సిలో వృద్ధులకు, గర్భిణీలకు, రోగులకు ,పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని జనసేన మండల యువ నాయకులు జడ్డు శ్రీను, పత్తి వెంకటేష్, ఉమామహేశ్వరరావు, అజయ్, సతీష్, మోహన్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సీతంపేట : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా స్థానిక సామాజిక భవనంలో మెగా రక్తదాన శిబిరం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సవర తోట మొకలింగం, మాలయ్య, పాండురంగ, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, సంధ్యారాణి పాల్గొన్నారు.

పాలకొండ : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జయకృష్ణ కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నిమ్మక పాండు, గండి రామినాయుడు, వెన్నపు శ్రీనివాస్ రావు, జనసేన నాయకులు ప్రశాంత్ కుమార్, పొట్నూరు రమేష్, తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి : మండల పరిధిలోని బురదవెంకటాపురంలో తెలుగుయువత మండల అధ్యక్షులు బొచ్చ జగదీష్ జన సైనికులతో కలిసి గ్రామంలోని మంచినీటి చెరువు గట్టుపై మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొచ్చ శంకర్రావు, సుమన్, పాల్, రాజు, శాంత, పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని బాబు జగజ్జ జీవన రావు కాలనీకూటమి నాయకులు ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, రాయిపల్లి రత్నాకర్, జనసేన జానీ పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహింఆరు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని బిల్లుమడలో మండల జనసేన అధ్యక్షులు రుంకు కిరణ్ ఆధ్వర్యంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిల్లుమడలో మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం, మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాకేటి రామారావు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తుమరాడలో జనసేన నాయకులు పడాల జయరాం, మర్రాపు సురేష్ ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్రా, గ్రీన్ ఆంధ్రాలో భాగంగా మొక్కలు నాటారు.

పార్వతీపురం టౌన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 54వ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నియోజకవర్గ సమన్వయకర్త ఆదాడ మోహనరావు ఆధ్వర్యంలో, పిన్నింటి జయకృష్ణ సమక్షంలో నిర్వహించారు. ముందుగా అన్నదానం చేశారు. పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కొత్తవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: పరజపాడు గ్రామానికి చెందిన అభిమానులు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పళ్ళను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ ఎల్ రంజిత్ కుమార్, జనసేన నాయకులు రిషివర్ధన్, శంకర్, సుధా, ప్రేమ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట: రక్తదానం చేస్తున్న పవన్ అభిమానులు



కురుపాం : కేక్ కట్ చేస్తున్న జగదీశ్వరి

అధిక వర్షాలకు పత్తిలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో సుమారు 3500 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఎక్కువ రోజులు మబ్బు వాతావరణం వారానికి పైగా వర్షాలు ఉండడం వల్ల నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. మండలంలో వర్షాధార పత్తి తేలిక నేలల్లో ఎక్కువగా సాగవుతున్నందున ప్రస్తుతానికి ప్రమాదం ఏమీ లేదని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కర్రివలసలో పత్తి పంటను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా పల్లం వైపు చిన్న కాలువను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పూత, గూడ దశలో ఉన్నందున రాలిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే వర్షాలు వెలసిన తర్వాత పచ్చదోమ, పేను బంక, ఆకు మచ్చ తెగుళ్ల ఉధృతమయ్యే అవకాశం ఉన్నందున వీలున్నచోట ముందుగా గొప్పు తవ్వి అంతర్ కృషి చేయాలన్నారు. అనంతరం ఎకరా 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని, రసం పీల్చు పురుగుల నివారణకు ఇమిడా క్లోప్రిడ్ తయో మెథో క్సో మ్ వంటి మందుల్లో ఒకదాన్ని లీటరు నీటికి 0.5 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు ప్రాఫి కొనజోల్ మందు



పాచిపెంట: పంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ఒక లీటరు నీటిలో ఒక మిల్లీ లీటర్ కలిపి పిచికారీ చేసుకోవాలి. అంతర్ కృషి చేయడం వల్ల వేరు వ్యవస్థ వద్ద గాలి పెరిగి పూత రాలిక తగ్గుతుంది. ఎకరాకు ఒక కేజీ మెగ్నీషియం 500 గ్రాముల బోరాన్ కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా సూక్ష్మ పోషక లోపాలను నివారించుకుని అధిక దిగుబడులు పొందవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

యుద్ధం వద్దు.. శాంతి కావాలి

ప్రజాశక్తి -పాచిపెంట

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండము ఆపాలని సిఐటియు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అమెరికా నాటో దేశాల సామ్రాజ్యవాదం నశించాలని, యుద్ధం ఆపాలని నినాదాలు సిఐటియు ఆధ్వర్యంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళన పాచిపెంటలోని గాంధీ బొమ్మ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచశాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తుందన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల ఎప్పటికీ 40 వేలమంది పాలస్తీనా పౌరులు మరణించారని, ఇందులో మహిళలు, చిన్నపిల్లలే 20వేల మందికి పైగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ కార్మిక వర్గం సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకించాలని, ప్రపంచశాంతికి నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరునాయుడు, గిరిజన సంఘం నాయకులు కొర్ర మత్స్యరాజు, ఆటో కార్మిక సంఘం నాయకులు ఎ.శ్రీనివాసరావు, వసంతరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రిలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో సోమవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారపార్టీ నాయకుల పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో అధికార పార్టీ నాయకుల పర్యవేక్షణలో పేదల పింఛన్లు పంపిణీ చేస్తున్నారని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో ఎన్నడూ నాయకుల పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ జరగలేదని చెప్పారు. గడచిన రెండు నెలల కాలంలో టిడిపి నాయకులు దగ్గరుండి పింఛను డబ్బులు పంపిణీ చేయించడం అలవాటుగా మారిందని చెప్పారు. పెదపదం పంచాయతీలో వైసిపి సానుభూతిపరులనే కక్షతో బాలగుడబ రాము, పెదపదం లక్ష్మణ, పెదపదం పరమేషుకు పింఛను డబ్బులు సకాలంలో పంపిణీ చేయలేదని చెప్పారు. తాను జోక్యం చేసుకుని పంచాయతీ కార్యదర్శిని హెచ్చరించిన తర్వాత అందజేశారని తెలిపారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులెవరైనా సంక్షేమ పథకాల పంపిణీలో జాప్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ హెచ్చరించారు.

గిరిజన గ్రామాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన ప్రాంతాల్లో తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో అంతంత మాత్రమే వైద్యమని, తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్న గిరిజన ప్రజలు ఇలా అయితే గిరిజన ప్రజలకు భరోసా ఎలా అని ప్రశ్నించారు. మండలంలోని నయా పంచాయతీ సంకేసు గుడ్డం గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున అధికారులు స్పందించి తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని, అదే విధంగా సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి తెలిపారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అంగన్వాడీ కేంద్రం-2లో గర్భిణులకు సామూహిక సీమం తాలు నిర్వహించారు. అనంతరం పీడీ మాట్లా డుతూ ఈనెల 2నుంచి 7వరకు పౌష్టికాహార నిర్వ హణపై అవగా హన నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో గర్భిణుల నమోదు, పౌష్టికాహారం తీసు కోవడం, పౌష్టికాహారం కలిగిన ఆహార పదార్థాలను గురించి



సీమంతాలు చేస్తున్న పీడీ రాణి

తెలపడం, రక్తహీనత వంటి సమస్యలపై సూచనలు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు తెలిపారు. కార్యక్రమంలో కొమరాడ ఐసిడిఎస్ పిఒ జి.సుగుణకుమారి, నోడల్ అధికారి కె.రాజేశ్వరి, సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, పి.అరుణ, పాల్గొన్నారు.

కూలిన ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత మూడు రోజులుగా తుపాను ప్రభావంతో పలు గ్రామాల్లో కూలిన ఇళ్లను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం పరిశీలించారు. మండలంలోని జోబుగూడ, వంజరాపు గూడ గ్రామాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వంతో చర్చించి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, తహశీల్దార్ అప్పారావు, ఆర్ఐ గిరి, విఆర్‌ఒలు గణపతి, గౌరమ్మ టిడిపి నాయకులు బుజ్జేశ్వరరావు, లోవరాజు, రామారావు, మన్మథ పాల్గొన్నారు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి -శృంగవరపుకోట



చంటిబాబు (ఫైల్)

మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని మరుపల్లిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విద్యుత్తు స్తంభాన్ని ముట్టుకోవడంతో షాక్ తగిలి చంటిబాబు (4) అనే బాలుడు మృతిచెందాడు. సోమవారం ఉదయం ఆరుబయట ఆడుకుంటూ పక్కనే ఉన్న విద్యుత్తు పోల్‌ను చంటిబాబు ముట్టుకున్నాడు. వర్షానికి తడిసి ఉన్న కరెంటు స్తంభం షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే బాలుడు మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చంటిబాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గౌరీష్ కోరారు.

లీజు సొమ్ము చెల్లించాలి

ప్రజాశక్తి - వంగర

మడ్డువలస జలాశయంలో చేపల వేట చేసిన కొట్టిశ శ్రీ సీతారామ మత్స్యకార సొసైటీ నుంచి ప్రభుత్వానికి చెల్లించవలసిన 1431, 1432, 1433, 1434 ఫసలీలకు సంబంధించిన రూ.57.74 లక్షలను వెంటనే చెల్లించాలని మత్స్యశాఖ రాజాం అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్‌వివి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మత్స్యకారులతో మగ్గూరులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ మత్స్యశాఖ సొసైటీలో 570 మంది సభ్యులు ఉన్నారని వీరికి సంబంధించిన డేటా కంప్యూటరీకరణ చేస్తున్నామని వెల్లడిం చారు.

అధ్యక్షుడు కాలపరిమితి ముగింపు

మడ్డువలస జలాశయంలో చేపల వేట చేసిన కొట్టిస శ్రీ సీతారామ మత్స్యకార సొసైటీకు ఇంతవరకు అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మీనారాయణ పదవీకాలం ముగిసిందని వెల్లడించారు. ఈ జలాశయంలో చేపల వేటకు సంబంధించిన బాధ్యతలను మత్స్యశాఖ జిల్లా అధికారి తమకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో విఎస్‌ఎలు చైతన్య శాస్త్రి, రఘురాం, శివ, మత్స్యకారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ఆరు పోలీసు స్టేషన్ల పరిధిలో 10 కేసులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంద్ర, బొబ్బిలి పోలీసు స్టేషన్ల పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన బృందంలోని చీపురుపల్లి మండలం పేరిపి గ్రామానికి చెందిన ఎలక గణేష్ (25) అరెస్టు చేసి, అతని నుండి రూ. 1.50 లక్షల విలువైన రాగి, అల్యూమినియం దిమ్మలను రికవరీ చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, కొత్తపేట, గుషిని, పారసాం, చంద్రంపేట గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఎలక్ట్రికల్ డిపార్టుమెంటు ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంద్ర, బొబ్బిలి పోలీసు స్టేషన్ల పరిధిలో కూడా ఇదే తరహా నేరాలు జరగడంతో స్పందించిన ఎస్‌పి సిసిఎస్ సిఐ ఎ.సత్యన్నారాయణ, భోగాపురం సిఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. నెల్లిమర్ల ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం మిమ్స్ ఆసుపత్రి సమీపంలో వాహన తనిఖీలు చేపడుతుండగా, గుర్ల వైపు నుండి విజయనగరం వైపు వస్తున్న ఒక ఆటోలో వెనుకన కూర్చున్న ఒక వ్యక్తి, పోలీసు తనిఖీలను చూసి, ఆటో దిగి, ఒక మూటతో పారిపోతుండగా, పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారణ చేసారు. విచారణలో తనతో పాటు తన బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సారికి దుర్గారావు, సారికి సురేష్ మరియు ముంగిన అజిత్ కుమార్ కలిసి ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. మిగిలిన నిందితులు కూడా పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు పోలీసులకు పట్టుబడ్డారని, ప్రస్తుతం వారు కూడా రిమాండ్‌లో ఉన్నారని ఎస్‌పి తెలిపారు. కేసులో క్రియాశీలకంగా పని చేసిన సిసిఎస్ సిఐ ఎ.సత్యన్నారాయణ, భోగాపురం సిఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ రామ గణేష్, సిసిఎస్ పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- డెంకాడ

తుపాను నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామంలో వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని గ్రామ, మండల స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గ్రామంలో ప్రతి ఇంటిని సర్వే చేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు, వాడుక నీరు కాలువల్లో నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, పంచాయతీరాజ్ జెఇ ఎం.సురేష్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ బి. ప్రవీణ్ శంకర్ జగన్నాథం, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-బొండపల్లి

స్థానిక పిహెచ్‌సిలో నేత్రదానంపై అవగాహన వాల్‌పోస్టర్‌ను సోమవారం వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ కె.శ్రీనివాస రావు, హెల్త్ సూపర్వైజర్ ఎస్.ఎ.బాషా పాల్గొన్నారు. అంబటివలస గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆరుగురు జ్వరపీడితులను గుర్తించి ఆర్‌డిటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ రాధాకుమారి, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి ఎం .రాధ, ఎంఎన్‌ఎం సహారా బేగం పాల్గొన్నారు.

నాగావళికి వరద గట్టు నిర్మించాలి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామం నుంచి తులివాడ వరకు నాగావళి నదికి రెండున్నర కిలోమీటర్ల మేర వరద గట్లు నిర్మించాలని టిడిపి మండల సీనియర్ నాయకులు నారు జనార్ధన రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నాగావళి నది వరద గట్టును పరిశీలించారు. 140 ఏళ్ల నాటి బ్రిటిష్ వరద గట్లు 1990లో వచ్చిన తుపానుకు గండి ఏర్పడిందని అప్పటి నుంచి వరదగట్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. సాయన్న ఛానల్, చిట్టగెడ్డ, గోపాలరావు కాలువలతో పాటు పిల్ల కాలువలు రూపురేఖలు మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వరద గట్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.